క్లుప్తంగా

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారాన్ని అందించాలని అప్పుడే వయస్సుకు తగిన విధంగా వారిలో ఎదుగుదల, బరువు, హిమోగ్లోబిన్ వంటివి ఉంటాయని ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి చెప్పారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఎంఆర్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయస్సుకు అనుగుణంగా పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు,అంగన్‌వాడీ కార్యకర్తలపైన ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.మంగ, డీఐఓ నాగేశ్వరరావు, డాక్టర్ మల్లికార్జునరావు, ఏఎన్ఎం ఎ.నాంచారమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.జయప్రద, కె.వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైర్ (ఆర్వో) ప్లాంట్‌ను బుధవారం యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ నాంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఏలూరు యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం వారు బాలుర వసతి గృహానికి ఈ ఆర్వో ప్లాంట్‌ను బహూకరించినట్లు ప్రిన్సిపల్ బీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. బ్యాంకు పథకాలపై గురుకులం ఉద్యోగులు, సిబ్బందికి యూబీఐ ఆర్ఎం శ్రీనివాసరావు వివరించారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటుచేసిన బ్యాంకు అధికారులకు గురుకుల ప్రిన్సిపాల్, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ బ్యాంకు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆయుధం

- పెరుగుతున్న అగ్ని ప్రమాదాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఏలూరు పాతబస్టాండ్ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై డెమో చూపుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

ఏలూరు టౌన్: వేసవి కాలం వచ్చిందంటే అగ్నిప్రమాదాలు సంభవిస్తూ ప్రాణ, ఆస్తి నష్టాన్ని తెస్తూ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తూ ఉంటాయి. ఇక ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తరచు అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడంతో భారీ ఆస్తి నష్టాన్ని మిగిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ ప్రతి ఏడాదీ వేసవిలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయటంతోపాటు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ప్రజలు ప్రమాదాల బారినుంచి ఏ విధంగా బయటపడాలనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు నగరంలో పాతబస్టాండ్ సెంటర్‌లో అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది డెమో నిర్వహించారు.

ఇటీవల ప్రమాదాలులిలా

- ఏలూరు నగరంలో గత వారం రోజుల్లో అగ్నిప్రమాదాలతో భారీ ఆస్తి నష్టంతో యజమానులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోనే అగ్నిప్రమాదాలు జరిగాయని అగ్నిమాపక అధికారులు పేర్కొంటున్నారు.
- ఏలూరు నగరంలోని శాంతినగర్ 7వ రోడ్డులో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలో మూడు రోజుల క్రితం ఒక అపార్ట్‌మెంట్‌లోని 4వ ఫ్లోర్‌లోని ఫ్లాట్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి, భారీగా రూ.15లక్షల వరకూ ఆస్తి నష్టం సంభవించింది. యజమానులు ఎవరూ ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయ ముప్పు తప్పింది.
- ఏలూరు పవర్‌పేట ప్రాంతంలో సర్వోదయ ఫర్నిచర్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ స్థాయిలో అస్తినష్టంతో యజమాని తీవ్ర స్థాయిలో నష్టపోయారు. సుమారు రూ.60 లక్షల నుంచి రూ.కోటి ఆస్తినష్టం జరిగిందని యజమానులు చెబుతున్నారు.
- అశోక్‌నగర్ ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో రాత్రివేళ ఆకస్మికంగా గీజర్ పేలిపోవటంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రాణ, ఆస్తి నష్టం లేకపోవడంతో యజమాను ఊపిరి పీల్చుకున్నారు.

20 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు

ఈ నెల 14న ఏలూరు జిల్లా కేంద్రంలో అగ్నిమాపక శాఖ అధికారి రత్నబాబు వారోత్సవాలను ప్రారంభించారు.

- 17న స్కూల్స్, కాలేజీల్లో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన తరగతులు
- 18న పెట్రోల్ బంక్స్, ఇండస్ట్రీస్, గోడౌన్స్‌లో అగ్నిమాపక నివారణపై అవగాహన సదస్సు.
- 19న ఏలూరులోని హాస్పిటల్స్‌లో అగ్ని ప్రమాదాల రక్షణకు తీసుకుంటోన్న చర్యలపై తనిఖీలు
- 20న అగ్నిప్రమాదాల నివారణపై వర్క్‌షాప్స్, సెమినార్స్ నిర్వహణ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే

ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే ప్రజలు భయాందోళనకు గురికాకుండా అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలి. అగ్నిప్రమాదాలపై 101, 112కు కాల్ చేస్తే అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపడతారు.

- ఇంటిలో ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్, పరికరాలనే వినియోగించాలి, గుర్తింపు పొందిన ఎలక్ట్రీషియన్‌తో వైరింగ్ చేయించాలి.
- చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాసులు, ఇతర మండే పదార్థాలను అందుబాటులో ఉంచరాదు.
- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా అజాగ్రత్తగా పారవేయకూడదు.
- నాసిరకం, పాడైన వైర్లను వాడకూడదు. విద్యుత్ సాకెట్‌ల్లో కెపాసిటీకి మంచి ఓవర్ లోడ్ వేసేలా వినియోగించకూడదు.
- వంటగదుల్లో చెడిపోయిన గ్యాస్ ట్యూబ్‌ను తొలగించి, ఐఎస్ఐ మార్కుతో కొత్త ట్యూబ్‌ను మాత్రమే వినియోగించాలిజ
- వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచకూడదు

కమర్షియల్ వినియోగంలో జాగ్రత్తలు

- షాపింగ్ మాల్స్, స్కూల్స్, కాలేజీలు, హాస్పిటల్స్‌లో ఆర్‌సీసీ, కాంక్రీట్ శ్లాబ్‌లను మాత్రమే వేయాలి.


పాతబస్టాండ్ వద్ద ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తోన్న అగ్నిమాపక సిబ్బంది

- కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి.
- విధిగా మాల్స్, హోటల్స్, హాస్పిటల్స్ వంటి వాటిలో సెల్లార్‌లలో ఆటోమేటెడ్ స్ప్రింక్లర్లను వినియోగించాలి.
- స్కూల్స్, కాలేజీలు, హాస్పిటల్స్, మాల్స్ వంటి భవనాల్లో అగ్నిప్రమాదాలు అరికట్టేందుకు తగినంత నీటిని, ఫిక్సిడ్ ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్, పరికరాలను నిబంధనల మేరకు ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్ ప్రమాదాలపై నీటిని వినియోగించకూడదు, పొడి ఇసుకను మాత్రమే వినియోగించాలి.
- విద్యుత్ ప్రవహిస్తోన్న తీగలపై అత్యవసర పరిస్థితుల్లో కార్బన్ డైయాక్సైడ్ ఎక్స్‌టింగ్ విషర్‌ను ఉపయోగించాలి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



ఏలూరులో అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలను చైతన్యవంతులను చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 20 వరకు ఆయా ప్రాంతాల్లో అవగాహన, డెమో నిర్వహించేలా చర్యలు చేపట్టాం. ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాల పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు నివారణ, జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేలా ప్రజలు చైతన్యవంతులు కావాలి.

– సీహెచ్ రత్నబాబు, ఏలూరు జిల్లా అగ్నిమాపక అధికారి

బీసీలను కించపరిస్తే సహించం


మోరు రామరాజు

దెందులూరు: రాష్ట్రంలో ఏ పార్టీ ప్రజాప్రతినిధులైన నాయకులైన బీసీలను కించపరిస్తే సహించబోమని వాటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రాష్ట్ర బీసీ సంఘం ముఖ్య నాయకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మోరు రామరాజు హెచ్చరించారు. బుధవారం ఏలూరు రోడ్డు మండలం మాదేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర బీసీ ముఖ్య నేత అయిన మాజీ మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావును కించపరిచే విధంగా కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలు బీసీలందరినీ కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడిన మాటల్లో తప్పేముందని ప్రశ్నించారు. బీజేపీలో పోటీ చేయని, గెలవని ఎంపీటీసీ సభ్యులను పోలీసుల అండతో దౌర్జన్యంగా ప్రజాస్వామ్యాన్ని కించపరిచే విధంగా పట్టపగలు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను కూటమి పార్టీ తరఫున మద్దతు ఇచ్చే విధంగా ఎలా ప్రకటించుకుంటారని ప్రశ్నించారు. ఈ సంఘటన దారి తప్పినరాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. కేంద్ర మంత్రి ప్రజలకు మేలు చేసే విధంగా వ్యవహరించాలి తప్ప ఓ సామాజిక వర్గానికి చెందిన నేతలను టార్గెట్ చేసి వ్యాఖ్యానించడం సరి కాదని మోరూ రామరాజు అన్నారు.

అక్రమ కేసులకు కాంగ్రెస్ భయపడదు


ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతిపక్ష నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి వేధించాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ భయపడదని, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూనే ఉంటుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ అక్రమం ఛార్జ్‌షీట్‌లో పేర్లు నమోదు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం నగరంలోని ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనాల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులను వేధించడంలో భాగంగా నేషనల్ హెరాల్డ్ ఆస్తులను జప్తు చేయడం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. కార్యక్రమంలో బొడ్డు నోబెల్, ప్రతాప సుబ్రహ్మణ్యం, తాళ్ళూరి చక్రవర్తి, దండుబోయిన చంద్రశేఖర్, లంకా రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసం శక్తి యాప్


సీఆర్ఆర్‌లో విద్యార్థినిలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్: మహిళలు, విద్యార్థినిల భద్రతకు భరోసా కల్పించేలా శక్తి యాప్‌ను ప్రతీ ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలనీ, ఆపద సమయాల్లో మీకు పోలీస్ అండగా ఉంటుందని ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. ఏలూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థినిలకు శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, విద్యార్థినిలు, బాలికలు ఎవరైనా అత్యవసర సమయాల్లో శక్తి యాప్‌తో పోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే పది నిమిషాల్లోనే మీవద్దకు పోలీస్ సిబ్బంది చేరుకుంటారని, రక్షణ కల్పిస్తారని తెలిపారు.

జాలిపూడిలో జాతర ప్రారంభం


కోలాట నృత్యం చేస్తున్న చిన్నారులు, మహిళలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో బుధవారం జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. దాదాపు 32 ఏళ్ల తర్వాత శ్రీ గంగానమ్మ, శ్రీ ఆదిమహాలక్ష్మమ్మ, శ్రీ వినుకొండ అంకమ్మ, శ్రీ పోతురాజు బాబు జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, దీపక్ నెక్స్‌జెన్ చైర్మన్ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం అమ్మవార్లను దర్శించుకుని, పూజలు చేశారు.

మూడేళ్లలో 'చింతలపూడి' పూర్తి

చింతలపూడి: తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రానున్న మూడేళ్లలో పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ పాల్ సతీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ నారాయణరావు పాల్గొన్నారు.

వైభవంగా కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం


కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు, కందుకూరి వీరేశలింగం ఏకపాత్రాబినయం ప్రదర్శిస్తున్న హమీద్, హరిశ్చంద్రుడి నాటకం ప్రదర్శిస్తున్న విజయ్ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 48వ కార్యక్రమంలో భాగంగా బుధవారం కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో సాయంత్రం ప్రారంభమైన కార్యక్రమాల్లో తొలుత సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం జాహ్నవి లాలిత్య స్వాగత నృత్యాలు, రంగస్థల నటుడు ఎస్ఎం హమీద్ కందుకూరి వీరేశలింగం ఏకపాత్ర, లక్ష్మీస్ ఎన్టీఆర్ ఫేమ్ సినీ నటుడు టి.విజయ్ కుమార్ హరిశ్చంద్రుడిగా, రంగస్థల నటి సీహెచ్ లలిత కుమారి చంద్రమతిగా హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. అలాగే కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త లంకా వెంకటేశ్వర్లుకు సంఘం తరఫున గౌరవ సత్కారం చేశారు. అనంతరం పౌరాణిక నటులు మెతుకుమెల్లి సూర్యనారాయణ యాదవ్, జానపద కళాకారులు మిరియాల శేఖర్ బాబు, వాయిద్య కళాకారుడు పూతి సాయిబాబు, భజన కళాకారిణి అనుపోతు భవానీలకు గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో ఆర్థిక సత్కారాన్ని అందించారు. ఎండీ ఖాజావలి, కళారత్న కేవీ సత్యనారాయణ, ఆలపాటి నాగేశ్వరరావు, టి.కామరాజు, గండికోట రాజేష్ సంకు సురేష్, గుప్తా ఫౌండేషన్ ప్రతినిధి నంద గోపాల్, కేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో కృష్ణా కాలువ


ఏలూరు కర్రవంతెన వద్ద కృష్ణా కాలువలో వ్యర్థాలు


నగరపాలక సంస్థ వంతెన వద్ద దుస్థితి

ఏలూరు నగరంలో ప్రవహించే కృష్ణా కాలువ కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. గతంలో ఎల్లప్పుడు నీటితో కళకళలాడుతూ కనిపించే కాలువ ఇప్పుడు వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. ఏలూరు నగర సరిహద్దు గ్రీన్ సిటీ నుండి మొదలై తూర్పులాకుల వరకు ఉండే ఈ కృష్ణా కాలువను అభివృద్ధి చేస్తాం.. ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా ఇరువైపులా రిటైనింగ్ వాల్ కట్టి వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేసి ప్రజలకు అందిస్తామని చెప్పే ప్రజాప్రతినిధులు కనీసం ఈ కాలువలోని వ్యర్థాలు కూడా తీయడం లేదు. నిత్యం ఆ కాలువ మీద నుంచే తిరిగే అధికారులకు, ప్రజాప్రతినిధులకు మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికైనా వ్యర్థాలు తీయించి కృష్ణా కాల్వకు పూర్వ వైభవం తేవాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు


తూడుతో నిండిపోయిన కృష్ణా కాలువ


వసంతమహల్ వంతెన వద్ద ఇలా

ఆర్టీసీ బస్సు ప్రారంభం


విజయవాడ నాన్‌స్టాప్ బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు డిపో నుంచి బుధవారం ఏలూరు నుండి విజయవాడ నాన్ స్టాప్ సర్వీస్ కొత్త అల్ట్రా డీలక్స్ సర్వీసును ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, విజయవాడ జోనల్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రజలకు సరికొత్త బస్సులు, సరికొత్త రూట్లలో మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ జీ. మురళి, స్టేషన్ మేనేజర్ కుమారి, పీఆర్ఓ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ముఖ్య నాయకులు బుధవారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి రాధాకృష్ణయ్య(చంటి)ని కలిశారు. ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్సు తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బయ్యారపు రాజేశ్వరరావు, జింజు మోజీస్, కాశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సగరులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి


కుప్పల ఆంజనేయులను అభినందిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో 50 వేల మంది ఉన్న సగరులకు రాజకీయ ప్రాథమిక కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి కోరారు. ఏలూరు జిల్లా సగర సంఘం అధ్యక్షుడిగా కుప్పల ఆంజనేయులు ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా లక్కోజు రాజగోపాలాచారి బుధవారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరారు. త్వరలో అన్ని రాజకీయ పార్టీ నాయకులు కలుస్తామని బీసీలు ఒక తాటి మీద తీసుకువచ్చి బీసీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో ఉక్కుసూరి గోపాలకృష్ణ, పామర్తి యేసు రాజు, బాయి వెంకటరావు, జరజాపు రాఘవ, ఈదలాడ నాని తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-08
వంకాయలు (గులాబీ)	22	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	28	బిళ్లచిక్కుడు	70
వంకాయలు (తెలుపు)	24	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	76
కాకర కాయలు	30	బీట్‌రూట్	30
బీరకాయలు	34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	38	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	18	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	34